క్లుప్తంగా

సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధి రామవరం 9వ వార్డులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టూ టౌన్ ఎస్‌ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు సైబర్‌నేరాలు, అపరిచితుల పట్ల అప్రమత్తతపై అవగాహన కల్పించారు. అత్యవసర, ఆపద సమయంలో 100కు డయల్ చేయాలని సూచించారు. కేవలం చదువుపై దృష్టి సారించి మంచి భవిష్యత్‌కై కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ (ఏహెచ్‌టీ), షీ టీమ్ పోలీసు సిబ్బంది, హెడ్ కానిస్టేబుల్ నాగయ్య, హెచ్‌ఎం డాక్టర్ ప్రభుదయాళ్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు షేడ్ నెట్లు పంపిణీ



నెట్లు అందజేస్తున్న ఎంపీడీఓ వెంకటలక్ష్మి

సుజాతనగర్: సుజాతనగర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఉపాధి కూలీలకు షేడ్ నెట్లు, కూల్ వాటర్ క్యాన్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను బుధవారం పంపిణీ చేశారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకటలక్ష్మి చేతుల మీదుగా వీటిని అందజేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ... ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు షేడ్ నెట్లు, కూల్ వాటర్ క్యాన్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఎండలు మండుతున్న నేపథ్యంలో కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.నరేందర్, ఎఫ్‌ఏ పుష్పలత పాల్గొన్నారు.

'అమ్మ ఆదర్శ పాఠశాలలు' ఎంపిక



కాకర్ల హైస్కూల్‌ను పరిశీలిస్తున్న చైర్మన్ శ్రావణి, కన్వీనర్ సంజీవరావు

జూలూరుపాడు: మండలంలోని 30 ప్రభుత్వ పాఠశాలలు అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమానికి ఎంపికై నట్లు మండల విద్యాశాఖ అధికారి గుగులోత్ వెంకట్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. గతంలో మన ఊరు – మన బడి కార్యక్రమం కింద ఎంపికైన 17 పాఠశాలలు, కేజీబీవీ-1, ఏజీహెచ్‌ఎస్-1, 6 గిరిజన ప్రాథమిక పాఠశాలలు మినహా 30 ప్రభుత్వ పాఠశాలలు అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమానికి ఎంపికై నట్లు చెప్పారు. ప్రస్తుతం 25 ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతుల ఖర్చును అంచనా వేసినట్లు చెప్పారు. మిగిలిన ఐదు పాఠశాలకు సంబంధించిన అంచనా వేయాల్సి ఉందని, సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందజేయడం జరుగుతుందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమానికి ఎంపికైన పాఠశాలల్లో తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించడంతోపాటు, మేజర్, మైనర్ రిపేర్లు చేపట్టడం జరుగుతుందని చెప్పారు. ఈ పనులు గ్రామసమాఖ్య అధ్యక్షురాలు అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్, పాఠశాల హెచ్‌ఎం కన్వీనర్‌గా కొనసాగే కమిటీ పర్యవేక్షణలో కొనసాగనున్నట్లు ఎంఈఓ తెలిపారు.

చలివేంద్రం ఏర్పాటు



ప్రారంభిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లిలో కూర బాలకృష్ణ చారిటబుల్ సర్వీసెస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కూర శ్రీధర్ ఆధ్వర్యంలో బుధవారం చలివేంద్రం ప్రారంభించారు. ట్రస్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ.. ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు, కోవిడ్ సమయంలో నిత్యావసరాలు, 15లక్షల మొక్కలు నాటడంతో పాటు నిరుపేదలకు చేయూత వంటి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. ముక్క కనకేశ్వరరావు, తెల్లాకుల డైమండ్ రావు, కొడుమూరి శ్రీనివాస్, పల్లపోతు శ్రీనివాస్, వెచ్చ శ్రీరాములు, వంకాయల సాయి ప్రసాద్, నరేంద్రుల రుషి కుమార్, దారా రమేశ్, దారా నగేశ్, వందనపు శ్రీధర్, పల్లపోతు సాయిబాబా, కృష్ణార్జునరావు, దస్త గిరి, చారుగుండ్ల నాగేశ్వరరావు, తాటికొండ సంతోష్, లగడపాటి రమేశ్ పాల్గొన్నారు.

శ్మశానవాటికలో అభివృద్ధి పనులు

- రూ.కోటి నిధులతో రోడ్లు, డ్రెయినేజీ, విద్యుత్ సౌకర్యం పనులు
- గ్యాస్‌తో దహన సంస్కారాలు

ఇల్లెందు: హిందూ సంప్రదాయం ప్రకారం దహన సంస్కారాలు పిడకలు, కట్టెలతో చేస్తారు. అయితే మారుతున్న కాలానికి అనుగుణంగా అడవులు దూరంగా ఉండటమో, అంతరించిపోవటమో జరిగింది. దీంతో ఒక శవాన్ని దహనం చేయాలంటే కట్టెలకు రూ.20వేల దాకా ఖర్చు చెల్లించాల్సి వస్తోంది. టింబర్ డిపోల నుంచి సేకరిస్తే తప్ప అడవుల నుంచి లభించే అవకాశం లేదు. ఈ క్రమంలో ఎలక్ట్రికల్, గ్యాస్‌తో దహన సంస్కారం అనువుగా మారింది. ఇప్పటికే పలు పట్టణాల్లో ఈ విధానాలు అమలులో ఉన్నాయి. ఈ తరుణంలో ఇల్లెందు పట్టణంలోని హిందూ శ్మశానవాటికను రూ.కోటి నిధులతో అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో భాగంగా కట్టెలకు స్వస్తి పలికి గ్యాస్‌తో మృతదేహాలను దహనం చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. సుమారు రూ.15 లక్షల వ్యయంతో శ్మశానవాటికలో గ్యాస్‌తో దహనం చేసే పరికరాలను సమకూర్చారు. నేడో రేపో టెక్నీషియన్లు వచ్చి ఆ పరికరాలను అమర్చనున్నారు. దీనివల్ల స్థానికులకు కట్టెల కోసం మిల్లుల వద్దకు పరుగెత్తాల్సిన పరిస్థితి తప్పిపోనుంది. ఒక గ్యాస్ సిలిండర్‌తో దహనం పూర్తవుతుందంటున్నారు.

అందుబాటులో ఆపరేటర్..

దహనం చేసేందుకు ఒక ఆపరేటర్‌ను అందుబాటులో ఉంచనున్నారు. గ్యాస్ ద్వారా దహనం పూర్తయ్యేలా అన్ని ఏర్పాట్లు ఈ ఆపరేటర్ పర్యవేక్షణలో జరుగనుంది. నిన్నటి వరకు కాటి కాపరి ఉండి కట్టెల మీద దహనం పర్యవేక్షించనుండగా ఈ పరికరం మీద దహనం జరిపించేందుకు ప్రత్యేకంగా శిక్షణ పొందిన ఆపరేటర్ ఉండనున్నాడు.

శ్మశానవాటికలో ఏర్పాట్లు ఇలా...

ఇల్లెందు హిందూ శ్మశానవాటికకు నాటి ప్రభుత్వం స్టేట్ గ్రాంట్స్ నిధుల నుంచి రూ. కోటి నిధులు కేటాయించింది. 2021 జూన్ 27న అప్పటి ఎమ్మెల్యే హరిప్రియ, చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. శ్మశానవాటికలో సీసీ రోడ్లు, కాలువలు, విద్యుత్ సదుపాయం, ప్రహరీ నిర్మాణం, మంచినీటి కోసం బోరు, మోటార్, మరుగుదొడ్లు, స్నానపు గదులు, విశ్రాంతి గదుల నిర్మాణం చేశారు. కర్మకాండ ప్రక్రియ కూడా శ్మశానవాటికలో చేసుకునేందుకు షెడ్డు కూడా రెడీ చేశారు. ఇక దింపుడు కళ్లం కోసం ప్రత్యేక మండపం, పిండ ప్రదానం ప్రత్యేక మండపం, పూజా కార్యక్రమం కోసం రూపకల్పన చేశారు. ఇలా సకల సదుపాయాలతో పాటు కట్టెల మీద దహనం చేయటాన్ని నిరోధించేందుకు గ్యాస్ ద్వారా దహనం చేసే విధానానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇక అస్థికలు భద్రపర్చేందుకు ప్రత్యేకంగా గదులు, కుటుంబ సభ్యులు విశ్రాంతి కోసం కూడా గదులు ఏర్పాటు చేశారు.

పరిశీలించిన చైర్మన్ డీవీ...

గ్యాస్‌తో దహనం చేసే పరికరాలు హిందూ శ్మశానవాటికకు రాగా ఇటీవల వాటిని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు సందర్శించి పరిశీలించారు. టెక్నికల్ రాక, పరికరాలను అమర్చేందుకు ఎన్నిరోజుల్లో పూర్తి చేసే అవకాశం ఉందో మున్సిపల్ అధికారులతో చర్చించారు. వేగంగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకుని రావాలని ఆదేశించారు.



ఇల్లెందులోని హిందూ శ్మశానవాటిక



గ్యాస్‌తో దహనం చేసే పరికరం



నీడ కోసం నిర్మించిన వేదిక

ఇబ్బంది రాకుండా..



హిందూ శ్మశానవాటికలో వానాకాలంతో సహా ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయబోతున్నాము. శ్మశానవాటికకు వెళితే అక్కడి సదుపాయాలు ఏ ఒక్కరిని ఇబ్బందులకు గురి చేయకూడదని, బాధను మర్చిపోయేలా అంతిమ కార్యక్రమం జరుపుకునేలా ఏర్పాట్లు చేశాము. దీనిని అన్ని వర్గాలూ ఉపయోగించుకోవచ్చు.

– డీవీ, చైర్మన్, ఇల్లెందు మున్సిపాలిటీ

ఉపయోగమే...



ఇల్లెందు హిందూ శ్మశానవాటికలో గ్యాస్ ద్వారా దహనం చేయటం ఎంతో ఉపయోగం. గతంలో కట్టెలు, పిడకలు ద్వారా చేసేవారు, ప్రస్తుతం అవి దొరికే పరిస్థితి లేదు. ఈ తరుణంలో గ్యాస్‌తో దహనం సంస్కారాలు చేసుకునే పరికరాలు రావడం మంచిదే. కాలుష్యం లాంటి సమస్య కూడా ఉండదు.

– నాయిని సైదులు, నంబర్–2 బస్తీ, ఇల్లెందు

ప్రలోభాలకు గురికావొద్దు..



ప్రభాత్‌నగర్‌లో ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

పాల్వంచరూరల్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు ఉన్న ప్రతీఒక్కరు ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి కోరారు. మండల పరిధి ప్రభాత్‌నగర్, గుత్తికోయ గిరిజనులు నివాసం ఉండే ఎస్టీ కాలనీలో బుధవారం ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడారు. ఓటు హక్కు ప్రాధాన్యతను గిరిజనులకు వివరించారు. ఓటు హక్కును ప్రతీఒక్కరు వినియోగించుకోవాలని కోరారు.

ఉపాధి జాబ్‌కార్డులు తీసుకోవాలి

మండలంలోని రెడ్డిగూడెం, యానంబైల్ గ్రామాల్లో ఉపాధి కూలీలతో ఎంపీడీఓ సమావేశమయ్యారు. ఉపాధి పనులకు ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ ఉన్న అందరూ జాబ్‌కార్డులను వెంట తీసుకుని పనులకు హాజరు కావాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీఓ బి.నారాయణ, ఏపీఓ పొరండ్ల రంగా, ఏపీఎం రాంబాబు, సీసీ శ్రీను, పంచాయతీ కార్యదర్శులు రమేష్, క్షేత్ర, సాంకేతిక సహాయకులు దేవరాజు, సామ్రాజ్యం, వీఓలు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఉగాది సంబురాలు



బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

పాల్వంచ: పాల్వంచ కళా పరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉగాది సంబురాలు ఆకట్టుకున్నాయి. బుధవారం రెండో రోజు రమాదేవి సమర్పణలో రామాయణం నృత్య కళారూపం, మిమిక్రీ, జానపద నృత్యాలు నిర్వహించారు. కవితా పోటీల్లో విజేతలు కటుకోర్వుల రమేశ్ (ఖమ్మం) ప్రథమ, బండ్ల మాధవరావు (విజయవాడ) ద్వితీయ, గోపగాని రవీందర్ (మంచిర్యాల) తృతీయ, పాణిగ్రాహి రాజశేఖర్ (విజయవాడ), సింగరాజు శ్రీనివాసరావు (ఒంగోలు), సోతుకు రత్నజానకి (మందమర్రి)లకు బహుమతులు అందించారు.

ఆర్థిక సాయం

ఇల్లెందురూరల్: తుదిశ్వాస వరకు విప్లవోద్యమం కోసం జీవితాన్ని అంకితం చేసి పేదరికంతో మృతి చెందిన గండి యాదన్న కుటుంబానికి ఏజెన్సీ గొడ హక్కుల పరిరక్షణ సంఘం బుధవారం ఆర్థిక సహాయం అందించింది. సంఘం ప్రతినిధులు మండలంలోని సంజయ్‌నగర్‌లో యాదన్న కుటుంబాన్ని కలిసి పరామర్శించారు. రూ.45వేలు నగదును కుటుంబ సభ్యులకు వితరణగా అందజేశారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో...

జూలూరుపాడు: ఇటీవల పాపకొల్లు గ్రామానికి చెందిన గోపి అనే భవన నిర్మాణ కార్మికుడు ప్రమాదానికి గురయ్యాడు. బుధవారం గోపిని సంఘం నాయకులు పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సంఘం తరుపున రూ.ఐదు వేల ఆర్థిక సాయం అందజేశారు.

గుండాల వెళ్లడం గగనమే..

ఇల్లెందు: గుండాల పరిసర ప్రాంత వాసులు ఏ చిన్న అవసరం వచ్చినా ఇల్లెందు లేదా కొత్తగూడెం వెళ్లాల్సిందే. అయితే కొత్తగూడెం కంటే ఇల్లెందు దగ్గర కావడంతో నిత్యం ఎక్కువ మంది ఇల్లెందుకే వస్తుంటారు. ప్రతీరోజు రాత్రి 8 గంటలకు ఇల్లెందు నుంచి గుండాలకు ఆర్టీసీ ఆఖరి సర్వీసు నడుస్తుంది. అయితే బుధవారం రాత్రి ఈ బస్సు మరమ్మతులకు గురి కాగా, అధికారులు ప్రత్యామ్నాయంగా మరో బస్సు ఏర్పాటు చేయలేదు. దీంతో పలువురు ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు.



బస్టాండ్‌లో బస్సు కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

కార్మికుల పనివేళలు మార్చరా?

సింగరేణి(కొత్తగూడెం): రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. ఈ నేపథ్యంలో సింగరేణి వ్యాప్తంగా సివిక్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల పనివేళలు మార్పు చేశారు. దీంతోపాటు కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలో కూడా ఈనెల 8 నుంచి పనివేళలను ఏరియా సివిల్ అధికారులు మార్చారు. కానీ కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాకు కూతవేటు దూరంలో ఉన్న కొత్తగూడెం ఏరియాలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు మాత్రం పనివేళలను మార్చలేదు. కారణం ఏదైనా కావచ్చు కానీ అన్ని ఏరియాల్లో మార్పు చేసిన క్రమంలో కొత్తగూడెం ఏరియాలో మార్పు చేయకపోవటంలో ఆంతర్యమేమిటని, సాక్షాత్తు సివిల్ సీఎం నివాసం ఉండే ఏరియాలోనే ఈ పరిస్థితి ఉండటం అధికారులు సవతి తల్లి ప్రేమను కనబరుస్తున్నారని, కార్మికులు ఆరోపిస్తున్నారు. కార్పొరేట్ ఏరియా కంటే కొత్తగూడెం ఏరియాలో ఓసీల వలన సుమారు 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ఇతర ఏరియాల కంటే ముందుగా కొత్తగూడెం ఏరియాకు పనివేళలు మార్పు చేయాల్సి ఉంది. కానీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా కార్మికులు ఇబ్బంది పడుతున్నారని వాపోతున్నారు. కొత్తగూడెం ఏరియాలో కార్మికులకు పనివేళలు మార్పు చేయించాల్సిన యూనియన్ నాయకులు అధికారుల పక్షాన చేరడంతో కార్మికుల గురించి పట్టించుకునే నాథుడే లేకుండా పోయారని, ఫలితంగా తాము ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొందంటున్నారు. ఇప్పటికైనా ఏరియా సివిల్ అధికారులు తమపై దయతలచి పనివేళలు మార్పు చేయాలని పలువురు కార్మికులు కోరుతున్నారు.



ఎండలో పనిచేస్తున్న సివిక్ కార్మికులు (ఫైల్)

ముస్లింలకు నిత్యావసరాల పంపిణీ



చుంచుపల్లి: సరుకులు అందజేస్తున్న డాక్టర్ వీరబాబు



కొత్తగూడెంరూరల్: ముస్లింలకు నిత్యావసరాలు అందజేస్తున్న పద్మ

చుంచుపల్లి: పవిత్ర రంజాన్ పర్వదినం సందర్భంగా బుధవారం విద్యానగర్‌లో ఎంసీహెచ్ ఆర్‌ఎంఓ డాక్టర్ భూక్యా వీరబాబు ఆధ్వర్యంలో 30 ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని తన వంతుగా సరుకులు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. సమాజ సేవలోనే ఎంతో ఆత్మ సంతృప్తి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో భూక్యా ఆరాధ్య, సిరాజుద్దీన్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెంరూరల్: ముస్లింలకు నిత్యావసర వస్తువులను శ్రీనగర్ ఎంపీటీసీ, జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షురాలు కొల్లు పద్మ బుధవారం అందజేశారు. మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో ముస్లింలకు, క్రిస్మస్ సమయంలో క్రైస్తవులకు, బతుకమ్మ సమయంలో హిందువులకు ఇలా ఏదో ఒక సాయం అందించడం సంతోషానిస్తుందన్నారు. ఈ సందర్భంగా సుమారు 30 మందికి ఐదు కిలోల బియ్యం, సేమ్యా, పంచదార, ఖర్జూరాలు, పాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో కొల్లు కొండలరావు, సంపత్‌కుమార్ పావని, షబానా, నూర్జహాన్, యాఖానీ, సయ్యద్ అహ్మద్, ఈసుఫ్, యాకూబ్, రజియా, సాజీదా, అరిస్యా తదితరులు ఉన్నారు.

కాషాయ జెండా ఎగరడం ఖాయం..



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి వినోద్‌రావు

జూలూరుపాడు: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాషాయ జెండా ఎగరడం ఖాయమని ఖమ్మం బీజేపీ ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు అన్నారు. బుధవారం వైరా నియోజకవర్గ పర్యటనలో భాగంగా ఖమ్మం బీజేపీ ఎంపీ అభ్యర్థి వినోద్‌రావు భారీ ర్యాలీతో జూలూరుపాడు చేరుకున్నారు. బీజేపీ జిల్లా నాయకుడు నున్నా రమేష్ నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వాటిని నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. నమ్మి నానబోస్తే పుచ్చి బుర్రలైనట్లు అనే చందంగా కాంగ్రెస్ పాలన సాగుతోందన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ఒక్కేటనని, మూడోసారి బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. ఖమ్మం ఎంపీ స్థానాన్ని టీడీపీ, జనసేన మద్దతుతో బీజేపీ ఘన విజయం సాధిస్తుందన్నారు. ఖమ్మంలో బీజేపీ జెండా ఎగరడం తథ్యమన్నారు. కొవ్వూరు రైల్వేలైన్ కోసం కృషి చేస్తానని, విద్య, వైద్యరంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని చెప్పారు. అనంతరం ఆయన భారీ ర్యాలీతో పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్, టీడీపీ రాష్ట్ర నాయకులు పారుపల్లి సురేష్, బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు జి.సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి శ్యామ్ రాథోడ్, నెల్లూరి కోటేశ్వరరావు, నున్నా రమేష్, మాదినేని సతీష్, సిరిపురపు ప్రసాద్, భూక్యా శ్రీను, గెల్లా సత్యనారాయణ, తెల్లం నరసింహారావు, సిరిపురపు గోపాల్‌రావు, నర్వనేని కృష్ణ, వందనపు సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ హామీ అమలేది?



మాట్లాడుతున్న జోగారావు

జూలూరుపాడు: ఎస్సీ వర్గీకరణ చేయకుండా మాదిగలను మోసం చేసిన బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని మాదిగ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోదుగు జోగారావు పిలుపునిచ్చారు. బుధవారం జూలూరుపాడులో జరిగిన ముఖ్యనాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేపడతామని చెప్పిన బీజేపీ పదేళ్లుగా అధికారంలో ఉన్నా హామీ నెరవేర్చలేదని ఆరోపించారు. మాదిగల మహాసభలో ప్రధాని నరేంద్ర మోదీ ఎస్సీ వర్గీకరణ చేపడతామని చెప్పి కమిటీలతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. మాదిగలను దగా చేసిన బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం పాటించి మాదిగలకు న్యాయం చేయాలని కోరారు. సిద్దెల రవి, వేల్పుల నరసింహారావు, పోతురాజు నాగరాజు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణపై దృష్టి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ధన్‌సింగ్

ఇల్లెందురూరల్: తాగునీటి ఎద్దడిపై నిరంతర పర్యవేక్షణతో సత్వర చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులతో తాగునీటి వనరులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే మండల వ్యాప్తంగా సర్వే నిర్వహించి అత్యవసరమైన పనులను రూ.34.99 లక్షల ఖర్చుతో చేపడుతున్నామని గుర్తు చేశారు. ఇంకా వచ్చిన ప్రతిపాదలనలకు అంచనాలు రూపొందించి రూ.69.45 లక్షల అంచనా వ్యయంతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. ఈ నిధులు రెండు, మూడు రోజుల్లో మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాలలోని చేతిపంపుల పనితీరును క్రమం తప్పకుండా పరిశీలించి అవసరమైన వాటికి వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. గతంలో ఉన్న తాగునీటి వనరుల ప్రస్తుత పరిస్థితి, అత్యవసరమైన సమయంలో వినియోగంలోకి తీసుకొచ్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నివేదికలు ఇవ్వాలని సూచించారు. సమావేశంలో మిషన్ భగీరథ గ్రిడ్ డీఈ బాలాజీ, ఎంపీఓ చిరంజీవి పాల్గొన్నారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి



మహనీయులకు నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

ఇల్లెందురూరల్: మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుంటే ఉన్నత స్థానానికి చేరుకుంటారని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బిందుశ్రీ అన్నారు. మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం బాబూ జగ్జీవన్‌రాం, మహాత్మా జ్యోతీరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ల జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బ్రిటీష్ పాలనలో ఆంగ్లవిద్య ద్వారా విజ్ఞానవంతురాలైన పూలే దార్శనికత, వివిధ అంశాలలో భారతీయులకు రావాల్సిన హక్కుల కోసం విజ్ఞప్తి చేయడమే కాకుండా డిమాండ్ చేసిన మహానేత పూలే అని కొనియాడారు.

భారత రాజ్యాంగ ప్రక్రియలో అంబేద్కర్ బహుజనుల అధికారం కోసం రిజర్వేషన్లు అమలు విధివిధానాల కోసం శ్రమించిన నేపథ్యం, అదే క్రమంలో స్వాతంత్ర్యానంతరం బహుజనుల హక్కుల కోసం బాబు జగ్జీవన్‌రాం చేసిన ఉద్యమాలు, చేసిన కృషి వెలకట్టలేనివని కీర్తించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఇంద్రాణి, రమేష్, శేఖర్, సురేంద్రకుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఈద్గాల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న చైర్మన్ డీవీ, తదితరులు

ఇల్లెందు: ముస్లింల పవిత్ర పండుగ రంజాన్ కోసం అన్ని ఈద్గాల వద్ద భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు కోరారు. బుధవారం ముస్లింలతో కలిసి ఈద్గా ప్రదేశాలను సందర్శించి పరిశీలించారు. గురువారం జరిగే రంజాన్ పండుగ నాటికి ఈద్గాల వద్ద చెత్త తొలగించి గుంతలు పూడ్చి నీటి సదుపాయం కల్పించాలని సూచించారు. అనంతరం కొత్త కాలనీలో మజీద్‌ను సందర్శించి పరిశీలించారు. వేసవికాలం దృష్ట్యా ప్రతీరోజు పనులు పూర్తి చేసిన తర్వాత వాటర్ క్యూరింగ్ చేపట్టాలని సూచించారు. రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలకు ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరావు, కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులు దానియేల్, సైదులు, మాజీ ఎమ్మెల్యే హరిప్రియ శుభాకాంక్షలు తెలిపారు.

పోరాట యోధుడు 'కానూరి'



ఇల్లెందు(టేకులపల్లి): వెంకటేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



ఇల్లెందురూరల్: నివాళులర్పిస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

ఇల్లెందు(టేకులపల్లి): బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ మతోన్మాద శక్తులు అమలు చేస్తున్న ఫాసిస్టు చర్యలకు వ్యతిరేకంగా ప్రజలను తన ఆటాపాటల ద్వారా చైతన్య పరిచిన అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపకుడు కానూరి వెంకటేశ్వరరావు నేడు లేకపోవడం దురదృష్టకరమని, ఆయన ఆదివాసీ గిరిజన, గ్రామీణ ప్రజలకు సులభంగా అర్థమయ్యే విధంగా ఎన్నో పాటలను, నాటకాలను కథలను రూపొందించిన ధన్యజీవి కానూరి అని ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి నోముల భానుచందర్, రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు బానోతు హరిజ అన్నారు. ఈ మేరకు బుధవారం కానూరి తొమ్మిదో వర్ధంతి సందర్భంగా మండల కేంద్రమైన టేకులపల్లిలో సభను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడారు. కార్యక్రమంలో బి.నర్సింగ్, నోముల కళావతి, భూక్యా నర్సింగ్, భూక్యా లక్ష్మణ్, తోటకూరి సతీష్, బానోత్ క్రాంతి, కిరణ్, నరేందర్ పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: అరుణోద్య సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు కానూరి వెంకటేశ్వరరావు 9వ వర్ధంతిని బుధవారం మండలంలోని పలు గ్రామాలలో న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆవునూరి మధు, తుపాకుల నాగేశ్వరరావు, సారంగపాణి పాల్గొన్నారు.